క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



శివపార్వతులు, నవగ్రహాల పూజలు

రాయికోడ్(అందోల్): మండలంలోని యూసుఫ్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు సంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు గర్భగుడిలోని శివలింగానికి మహాఅభిషేకం నిర్వహించి విగ్రహ మూర్తులకు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం హోమం నిర్వహించి నవగ్రహ పూజలు చేశారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నారింజ ప్రాజెక్టుకు జలకళ



నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టు

జహీరాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారింజ ప్రాజెక్టులోకి వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో నారింజ ప్రాజెక్టు ఉంది. సాగుకు నిర్మించిన ప్రాజెక్టు కాలువలు దెబ్బతినడంతో ఊట చెరువుగా మార్చారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వేసవిలో జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చింది. ప్రస్తుతం 14 ఫీట్లకు నీరు నిల్వ ఉంది. నారింజ ప్రాజెక్టుకు జలకళ రావడంతో జహీరాబాద్‌-బీదర్ రహదారి గుండా ప్రయాణించే వారు సెల్ఫీలు తీసుకుంటున్నారు.

రేషన్ దుకాణాల వద్ద బారులు

సంగారెడ్డి క్రైమ్: ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా మూడు నెలల సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుడటంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. పట్టణంలోని రేషన్ దుకాణాల వద్ద ఉదయం నుంచే ప్రజలు, చిన్నారులు క్యూల్లో ఉండి బియ్యాన్ని తీసుకుంటున్నారు. మండుటెండల నేపథ్యంలో రేషన్ తీసుకునే వారికి రేషన్ దుకాణాల వద్ద కనీసం నిలువ నీడ కూడా లేకుండా పోయింది.

రాబోయే కాలం చిరుధాన్యాలదే



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

జహీరాబాద్: రాబోయే కాలం చిరుధాన్యాలదేనని, వీటి సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని చిరుధాన్యాల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం కోహీర్‌లోని వెంకటాపూర్, కవేలి, పిచరాగడి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిరు ధాన్యాలసాగు, ఉపయోగాలు, వాటిలో ఉండే పోషకాల గురించి రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. డీడీఎస్‌-కేవీకే శాస్త్రవేత్తలు శైలజ,రమేష్, హేమలత, పంటల యాజమాన్యంపై వివరించారు.

గొల్ల,కుర్మలపై పాట



సోమన్న బృందానికి సన్మానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నాగ్సాన్‌పల్లిలో మంగళవారం గొల్ల,కుర్మల స్థితిగతులపై గాయకుడు ఏపూరి సోమన్న బృందం పాట చిత్రీకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేష్ హాజరై పాట చిత్రీకరణను ప్రారంభించారు. పాట చిత్రీకరణపై ఏపూరి సోమన్న బృందానికి అభినందనలు తెలిపారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అమ్మవారికి విశేష అభిషేకం, హోమా లు చేశారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మామిడి టంకర్ల తయారీతో ఉపాధి

- కూలీ పనుల్లో మహిళలు
- ఆశాజనకంగా మార్కెట్ ధరలు
- రూ.33 వేలకు పెరిగిన మద్దతు ధర



మామిడి కాయలను ముక్కలుగా కోస్తున్న మహిళలు

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిహామీకి తోడు మామిడి టంకర్ల తయారీలోనూ ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. కంగ్టి మండలం తడ్కల్ గ్రామం మామిడి టంకర్ల తయారీకి జిల్లాలోనే ప్రఖ్యాతిగాంచింది. తడ్కల్‌కు చెందిన వ్యాపారులు పరిసర గ్రామాలు, మండలాల్లోనే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మామిడి కాయలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. చెట్లకు పిందెలు ప్రారంభమైన వెంటనే రెండు నెలల ముందే ఆయా ప్రాంతాల్లో తిరిగి చెట్లకు కాసిన కాయలను అంచనా వేసి కొనుగోలు చేస్తుంటారు. మే మాసంలో చెట్లకు కాసిన కాయలు రాల్చి తడ్కల్‌కు తరలిస్తారు. దాదాపు 20 మంది టంకర్ల తయారీ వ్యాపారం చేస్తున్నారు. చెట్ల నీడలో మామిడి కాయల పొట్టు తీసి, ముక్కలుగా కోసి ఎండలో వేస్తారు. దీంతో వందల సంఖ్యలో మహిళలు ఉపాధి పొందుతున్నారు. తయారైన టంకర్లను పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మార్కెట్‌కు తరలిస్తారు. తెలంగాణలోనే అత్యధికంగా టంకర్ల వ్యాపారం నిజామాబాద్ జిల్లాలోనే కొనసాగుతుంది. ఈ యేడు టంకర్లకు ప్రారంభంలో ధరలు అంతంత మాత్రంగా ఉన్నా గత రెండు రోజులుగా క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ. 33వేల వరకు ధర పలుకుతున్నట్లు తెలిపారు. తెల్లగా ఉన్న టంకర్లకు మంచి గిరాకీ ఉండడంతో పాటు గుజరాత్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. దీంతో తమకు మంచి ప్రయోజనం చేకూరుతుందని పరిసర గ్రామాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



ఎండలో వేసిన మామిడి టంకర్లు

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



హత్నూర రైతు వేదికలో భూభారతి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ పర్వీన్ షేక్

హత్నూర(సంగారెడ్డి): భూ సమస్యల పరిష్కరించేందుకే భూ భారతి సదస్సులలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ పర్వీన్ షేక్ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన హత్నూర రైతు వేదిక, మధుర గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహనతోపాటు భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...రైతులకు భూ సమస్యలు ఉంటే భూభారతి సదస్సులలో దరఖాస్తులు చేసుకోవచ్చని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించే భూ సమస్యలు కొంత సమయం పడుతుందని తెలిపారు. భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దావూద్, సర్వే శ్రీనివాస్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకా రం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 33 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా 29 మందికి రూ. వెయ్యి, నలుగురికి రూ.2 వేల చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

13 మందికి..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, సంగారెడ్డి పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రూ.2000, ఏడుగురికి రూ.1500, మిగతా ఐదుగురికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగ



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగ

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో విద్యుత్తు స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తీగలు అల్లుకుపోతున్నాయి. ఝరాసంగం మండలంలోని చాలా చోట్ల పిచ్చిగడ్డితో నిండిపోవడం వల్ల తీగలు అల్లుకుని ప్రమాదకంగా మారాయి. ఏపుగా పెరిగి కింది భాగం నుంచి స్తంభంపై వరకు అల్లుకున్నాయి. గ్రామాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగలు అల్లుకున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్తు సరఫరా అయ్యి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉంది.

గోసంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): గోసంరక్షణ చట్టం కఠినంగా అమలు చేయాలని అందోల్ మండల భజరంగ్‌దళ్ సంయోజక్ ఆంజనేయులు అన్నారు. గోహత్య జరగకుండా కాపాడాలని బజరంగదళ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ తేన్‌మొలి, సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ పాండులకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేదకాలం నుంచి సకల దేవత స్వరూపంగా భావించి గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నామన్నారు. గోవులను, పశులను వధించకూడదని చట్టం చెబుతున్నప్పటికీ రెట్టింపు స్థాయిలో గోవధ జరుగుతుందని వాపోయారు. గోవధ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భజరంగదళ్ సహ సంయోజక్ హనుమాన్‌దాస్, ప్రకండ ప్రముఖ్ రాకేష్‌గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి

- జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే



హేమంత్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బల్దియా పరిధిలోని భారతీనగర్, పటాన్‌చెరు, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్ హేమంత్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో హేమంత్‌తో ఎమ్మెల్యే సమావేశమై మూడు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు. పారిశుద్ధ్య విభాగంలో దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులు, చనిపోయిన వారి స్థానాల్లో నూతన ఉద్యోగులను నియమించాలన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తోన్న ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్, వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయని.. వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనాల కొరత మూలంగా చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోందని...వెంటనే నూతన వాహనాలతోపాటు మినీ టిప్పర్లు, నిచ్చెనల్తో కూడిన వాహనాలను కేటాయించాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ హేమంత్ స్పందిస్తూ అతి త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేశ్, ఎస్ఈ శంకర్ నాయక్, డీఈ నరేందర్, దేవేందర్, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా తనిఖీ చేయాలి

- డీఎస్పీ సత్తయ్యగౌడ్



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ

కంది(సంగారెడ్డి): పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహనాల తనిఖీ చేట్టాలని డీఎస్పీ సత్తయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కంది, కాశీపూర్ శివారుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై రవీందర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహజవనరులను పరిరక్షించుకోవాలి

నారాయణఖేడ్: సహజవనరులను పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరు సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. స్టోన్ వాటర్‌డే సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల పక్కన పెరిగిన చెట్ల పొదలను జేసీబీతో తొలగించారు. పలుకాలనీల్లో మురుగుకాల్వలు, వీధులను శుభ్రం చేశారు. పచ్చదనం, పరిశుభ్రత, సహజవనరుల పరిరక్షణ తదితర అంశాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులతో ప్రయోజనం

- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి

కంది(సంగారెడ్డి): భూ సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కంది మండలం బ్యాతోల్లో భూభారతిపై నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. అధికారులు గ్రామాలకు వచ్చి రైతుల వద్ద నుంచి దరఖాస్తులను తీసుకొని పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, మాజీ సర్పంచ్ శ్రీశైలం గ్రామరైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కంది: రెవెన్యూ సదస్సులో నిర్మలారెడ్డి

భూ సమస్యలపై ఫిర్యాదు స్వీకరణ

రాయికోడ్(అందోల్): మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మంగళవారం మండలంలోని ఔరంగానగర్, యూసుఫ్‌పూర్ గ్రామాల్లో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలోని రెవెన్యూ సిబ్బంది భూసమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

అత్యాధునిక వసతులతో మోడల్ హౌస్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఇంటిని పరిశీలిస్తున్న మహిపాల్ రెడ్డి, అంజిరెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ఇందిరమ్మ ఇళ్ల పతాకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. నిర్మాణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అతి తక్కువ ఖర్చు, అత్యాధునిక హంగులతో అన్ని వసతులు కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడం అభినందనీయమన్నారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీఓ అర్జునరెడ్డి, నిర్మాణ సంస్థ చైర్మన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆలయం సందర్శన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెల్టూర్‌లోని అతి పురాతనమైన పార్వతీ పరమేశ్వర ఆలయాన్ని మంగళవారం తంగడపల్లి జంగమయ్య గుట్ట శివయోగి శివాచార్య మహాస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో విగ్రహాల పున:ప్రతిష్టాపన కార్యక్రమంపై గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

నారాయణఖేడ్: పట్టణంలోని మంగల్‌పేట్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు పూర్తిగా ధ్వంసమైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తీర్చాలని సీపీఎం ఏరియా కార్యదర్శి రమేష్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయం కావడంతో వర్షం నీరు నిలిచి వాహనాలు వెళ్లినప్పుడు పాదాచారులపై చిమ్ముతున్నాయని, రాళ్లు ఎగిరివచ్చి తగులుతున్నాయని వాపోయారు. సేవాలాల్‌చౌక్ వద్ద దెబ్బతిన్న రోడ్డును బాగుచేయాలని కోరారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మూలా విత్తనంతో తీరనున్న చింత

- వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రొఫెసర్ శివలక్ష్మి

జహీరాబాద్: వానాకాలం పంటల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న మూలవిత్తనంతో రైతులకు భవిష్యత్తులో విత్తనచింత తీరనుందని జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రొఫెసర్ శివలక్ష్మి అన్నారు. మంగళవారం కోహీర్‌లోని రైతు వేదికలో రైతులకు కంది మూలవిత్తనం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభ్యుదయ రైతులకు మూలవిత్తనం అందిస్తామన్నారు. పంట వచ్చాక తిరిగి తోటి రైతులకు విత్తనంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం తీసుకుందన్నారు. వచ్చిన పంటను రైతులు విత్తనంగా వినియోగించుకోవడం వల్ల విత్తనాల సమస్య తీరుతుందన్నారు. విత్తనాలు పొందిన రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ విత్తనాలు ఎండు తెగుళ్లను సైతం తట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ నవీన్‌కుమార్, ఏఈఓలు శ్రీనివాస్, జి.స్వాతి, సంధ్య, సవిత, ప్రశాంత్, మౌనిక, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కంది విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ శివలక్ష్మి

రైతులకు మూల విత్తనాలు పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్‌లో మంగళవారం రైతులకు మూల విత్తనాలు పంపిణీ చేశారు. ఏఓలు వెంకటేశం, హరికృష్ణ మట్లాడుతూ.. విత్తనాలను స్వయంగా ఉత్పత్తి చేసి ఇతర రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష, కృష్ణావేణి, నాయకులు దేవదాస్, సంగారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

సంగారెడ్డి : రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి వచ్చిన వరి పునాది విత్తనాన్ని రైతులకు చౌటకూర్ రైతు వేదికలో మంగళవారం పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దశరత్, యూనివర్సిటీ శాస్త్రవేత్త ప్రగతి , వ్యవసాయ అధికారి ప్రావీణ , వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, దత్తు, రాజు, మండల రైతులు పాల్గొన్నారు. ఈ విత్తనం సాగు విధానం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు .

కాసాల రైతువేదికలో ..

హత్నూర(సంగారెడ్డి): అభ్యుదయ రైతులకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన మూల విత్తనాల (ఫౌండేషన్ సీడ్) మంగళవారం 60 కిట్ల వరి విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కాసాల రైతువేదికలో రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ మూల విత్తనాలను ఒక్కో గ్రామంలో ఎంపిక చేసిన 2 లేదా 3 అభ్యుదయ రైతులకు వ్యవసాయశాఖ వారు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్లు విజయలక్ష్మి, ఆసిఫ్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మొరం మట్టి పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాంనగర్ నుంచి కాంతారెడ్డి కాలనీ వరకు వేసిన సీసీరోడ్డు సైడ్‌లకు మొరం మట్టి డంప్ చేయడం ప్రారంభించారు. 3న ×రోడ్డు వేశారు..మొరం వేయడం మరిచారు! అనే శిర్షికన సాక్షి దిన పత్రికల ప్రచురితమైన వార్తకు స్పందించిన కాంట్రాక్టర్ మంగళవారం రాత్రి నుంచి మొరం మట్టి పనులను ప్రాంభించారు. ఈ మేర కు ట్రిప్పర్ల ద్వారా మొరం మట్టిని సీసీ రోడ్డు పొడువునా డంప్ చేస్తున్నారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

◆ మొలకెత్తిన ఆశల పత్తి

ఝరాసంగం(జహీరాబాద్): వానాకాలం సీజన్‌లో జిల్లాలో ప్రధానంగా వాణిజ్య పంట పత్తిని అత్యధికంగా సాగు చేస్తుంటారు. గత నెల చివరలో కురిసిన వర్షాలకు విత్తనాలు విత్తేరు. ఝరాసంగం పరిదిలోని తుమ్మన్‌పల్లిలో ప్రస్తుతం రెండు నుంచి నాలుగు ఆకులతో కూడిన మొక్కలు దర్శనమిస్తున్నాయి.

◆ చారిత్రాత్మక వేతన ఒప్పందం చేయిస్తా

జహీరాబాద్ టౌన్: మహీంద్ర కార్మికుల సంక్షేమ కోసం సీఐటీయూని గెలిపించాలని రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు కోరారు. జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మహీంద్రలో పలుమార్లు చారిత్రాత్మకమైన వేతన ఒప్పందం చేయించామని, మరోమారు రూ. 25వేలతో వేతన ఒప్పందం చేయిస్తానని చెప్పారు. 5న జరిగే ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని కోరారు.

◆ సింగూరు ప్రాజెక్టు సందర్శన

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టును మంగళవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం.. ప్రస్తుతం ఉన్న నీటి క్యాపాసిటిని నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్యాం ఎగువభాగం మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో వస్తుండటంతో పోలీస్, నీటి పారుదలశాఖ అధికారులు సమన్వయంతో ఉండాలని సూచించారు. అంతకుముందు పుల్‌కల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నాడు. పెండింగ్ కేసులను సత్వరం దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్ఐ క్రాంతికుమార్‌ను ఆదేశించారు.

◆ తల్లిదండ్రులపై కేసులు నమోదు

కంగ్టి(నారాయణఖేడ్): మైనర్‌లకు వాహనాలు ఇచ్చి వారితో డ్రైవింగ్ చేయిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని కంగ్టి ఎస్ఐ సిద్ధ దుర్గారెడ్డి హెచ్చరించారు. కంగ్టి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం సమీపించడంతో చెరువులు, కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ జాతీయ జెండాపై అలసత్వం

ఝరాసంగం(జహీరాబాద్): జాతీయ జెండాపై విద్యాశాఖ అధికారులు అలసత్వం వహించారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో జాతీయ జెండాను ఎగరవేశారు. నిబంధనల ప్రకారం సూర్యాస్తమయం తర్వాత జెండాను ఉంచకూడదు అనే నిబంధన ఉన్నప్పటికీ పలు పాఠశాలలోని ఉపాధ్యాయులు అలాగే ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం ఒక గంటల వరకు తొలగించలేకపోయారు. పాఠశాలల గేటుకు తాళాలు వేసి వెళ్లిపోయారు. మండలంలోని కృష్ణాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, కుప్పానగర్‌లోని ఉర్దూమీడియం ప్రభుత్వ పాఠశాలలో జెండాను అలాగే ఉంచారు. గమనించిన పలువురు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.